నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి 1
శుక్రవారం 23 జూన్ 2023

అందుబాటులో ఎరువులు

- రైతులు సద్వినియోగం చేసుకోవాలి
- సొసైటీ కార్యదర్శి బాబురావు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ సింగిల్ విండో సొసైటీ పరిధిలో ప్రభుత్వ ధరలతో రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో కార్యదర్శి జె.బాబురావు తెలిపారు. సొసైటీ పరిధిలో స్టిక్ డీఏపీ రకం, అలాగే 2020 రకం రసాయన ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, డీఏపీ మందు సంచి ధర రూ.1350, 2020 రకం మందు ధర రూ.1150 ఉందని వివరించారు.

పూజారికి అధికారిక పత్రం అందజేత


అధికారిక పత్రం అందుకుంటున్న పూజారి

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనిపల్లి గ్రామంలోని శివాలయం పూజారి రాచపూడి శ్రీనివాస్‌కు బోధన్ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ అమీర్ చేతుల మీదుగా అధికారిక పత్రాన్ని గురువారం అందజేశారు. శివాలయంలో ప్రతిరోజు ధూప దీప నైవేద్యంలో భాగంగా పూజారికి ఈ అనుమతి పత్రాన్ని అందజేశారు. స్థానిక పెద్దలు కృష్ణారెడ్డి, రొడ్ల లింగం, మల్లేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఏనుగు రవీందర్‌రెడ్డి?

- మదన్‌మోహన్ మంతనాలు
- ఎమ్మెల్యే సీటు ఆఫర్
- అవసరమైతే ఎంపీ పదవికి మదన్
- అనుచరుల్లో జోరుగా చర్చ
- అలాంటిదేమీ లేదు : రవీందర్‌రెడ్డి

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలోకి చేరిన మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జోరందుకుంది. ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయించాలనే ప్రస్తావన జరుగుతున్నట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మదన్‌మోహన్.. ఏనుగురవీందర్‌రెడ్డితో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. అవసరమైతే జహీరాబాద్ ఎంపీ స్థానం నుంచి మదన్‌మోహన్ పోటీ చేసి ఎల్లారెడ్డి అసెంబ్లీ నుంచి రవీందర్‌రెడ్డిని బరిలోకి దించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో రవీందర్‌రెడ్డి అనుచరుల్లో ఈ చర్చ జోరుగా సాగుతోంది. అయితే ఇదే విషయమై ఏనుగు రవీందర్‌రెడ్డిని సంప్రదించగా 'అలాంటిదేమీ లేదు' అని అన్నారు. మదన్‌మోహన్ ఓ మిత్రుడిగా సాధారణంగా మాట్లాడుతుంటామని అన్నారు.

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం మూటగట్టుకున్నప్పటికీ.. ఎల్లారెడ్డిలో భారీ మెజార్టీతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో జాజాల సురేందర్ కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఏనుగు రవీందర్‌రెడ్డి(టీఆర్ఎస్)పై గెలుపొందారు. అయితే ఆ తరువాత సురేందర్ కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నాటి నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి అధికార పార్టీ కార్యక్రమాల్లో ప్రాధాన్యత తగ్గింది. జాజాల సురేందర్ నిర్వహించే అధికార పార్టీ కార్యక్రమాల్లో ఆయన అనుచరులకు ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో రవీందర్‌రెడ్డి రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. స్వంత పార్టీలో ప్రాధాన్యత కరువవ్వడంతో ఆయన బీఆర్ఎస్ వీడి.. బీజేపీలోకి చేరారు. కానీ బీజేపీలో చేరినప్పటికీ క్రియాశీలకంగా ఉండలేకపోయారు. ఓ వైపు కేంద్ర ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవడం, రాష్ట్ర నాయకత్వంలో గ్రూపులు ఉండటంతో ఆయన ఆత్మపరిశీలనలో పడ్డారు. ఇక కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో రాష్ట్రంలో హస్తం పార్టీ జోరు పెరిగింది. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి, ఎంపీ జూపల్లి, పొంగులేటితో పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి భేటీ అయిన విషయం తెలిసిందే. పైగా వీరిద్దరితో పాటు ఈటల రాజేందర్ పలువురు చేరుతారని ఊహాగానాలు వచ్చాయి. అయితే ఈటల రాజేందర్ ఒకవేళ కాంగ్రెస్‌లో చేరితో వెంటనే ఆయనతో పాటు హస్తం గూటికి చేరాలన్న ఆలోచనలో రవీందర్‌రెడ్డి ఉన్నట్టు ఆయన అనుచరులు చర్చించుకుంటున్నారు.



మదన్‌మోహన్ మంతనాలు!

కాంగ్రెస్ పార్టీలో రవీందర్‌రెడ్డి చేరే అంశంపై ఆ పార్టీ సీనియర్ నాయకులు మదన్‌మోహన్ చర్చించినట్టు సమాచారం.

ఈ విషయమై పలుమార్లు ఇద్దరి మధ్య చర్చ కూడా జరిగిందని సమాచారం. ఒకవేళ రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరితో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీకి అవకాశం కల్పించే అంశంపై చర్చ జరిగినట్టు తెలిసింది. ప్రస్తుతం ఎల్లారెడ్డి నియోజకవర్గంలో వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఇక్కడ వడ్డేపల్లి సుభాష్‌రెడ్డికి మదన్‌మోహన్‌కు మధ్య వార్ నడుస్తోంది. షబ్బీర్ అలీకి సుభాష్‌రెడ్డి మద్దతుదారుగా ఉన్నారు. దీంతో షబ్బీర్ అలీ వర్గానికి పార్టీలో చెక్ పెట్టేందుకు మదన్‌మోహన్ ప్రయత్నిస్తున్నట్టు టాక్. షబ్బీర్ అలీ ప్రోద్బలంతోనే మదన్‌మోహన్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు ప్రచారం జరిగిన విషయం తెలిసిందే.

అలాంటిదేమీ లేదు

కాంగ్రెస్ పార్టీలో చేరే అంశంపై ఏనుగు రవీందర్‌రెడ్డిని వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని అన్నారు. జ్వరంతో కొన్ని రోజులుగా ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నట్టు తెలిపారు. మదన్‌మోహన్‌తో చర్చ విషయమై ఆరా తీయగా.. ఓ మిత్రుడిగా మదన్‌మోహన్‌తో సాధారణంగా మాట్లాడుతుంటానని చెప్పారు.

- ఏనుగు రవీందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

విద్యాశాఖలో ఆ అధికారిపై చర్యలు తీసుకోండి


- కలెక్టర్‌కు ఉపాధ్యాయ సంఘాల వినతి
- నవతెలంగాణ కథనంతో డీఈఓ కార్యాలయం కదిలిక


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

విద్యాశాఖలో ఎస్ఎస్ఏ విభాగంలో అవినీతికి పాల్పడుతున్న సెక్టోరియల్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాయి. ఈ మేరకు గురువారం డిటిఎఫ్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. గత జనవరిలో ఎఫ్ఏఓగా సదరు అధికారికి డీఈఓ అదనపు బాధ్యతలు అప్పగిస్తున్న సమయంలోనే ఉపాధ్యాయ సంఘాలుగా వ్యతిరేకించామని గుర్తు చేశారు. కస్తూర్బా పాఠశాలలో ఎస్ఓలను డబ్బుల కోసం వేధించారని, గెజిటెడ్ హెడ్మాస్టర్‌గా రెండు పాఠశాలలో పని చేసినప్పుడు అనేక అవినీతి అక్రమాలకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. 19.8.2022లో డీఈఓకు ఫిర్యాదు సైతం చేశామని కలెక్టర్‌కు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణలో నిజాలు తేలి సస్పెండ్ అయ్యారని తెలిపారు. ఎఫ్ఏఓగా అదనపు బాధ్యతలు ఇవ్వకూడదని చేసిన మా విజ్ఞప్తిని డిఇఓ ఏ మాత్రం పట్టించుకోలేదని వాపోయారు. కొన్ని రోజులకే అదనపు బాధ్యతలు అని చెప్పి... ఆరు నెలలుగా ఆమెనే కొనసాగిస్తున్నారని తెలిపారు. ఫలితంగా డీఇఓ కార్యాలయంలో అజమాయిషి చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడు తున్నారని పేర్కొన్నారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోకుండా.. ఉపాధ్యాయ సంఘాలు చేసిన ఫిర్యాదుపై పది నెలలుగా విచారణ జరిపించకపోవడం గమనార్హమని వాపోయారు. ఎఫ్ఏఓగా అదనపు బాధ్యతలు తీసుకున్న తరువాత ఆర్థిక లావాదేవీలపై సిబ్బందిలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నవతెలంగాణలో ప్రచురితమైన వార్త కథనం మరింత బలాన్ని చేకూరుస్తుందని వివరించారు. వార్తాపత్రిక కథనం ప్రకారం ఇటీవల అనధికారికంగా అకౌంట్ సెక్షన్ సిబ్బందితో సమావేశం నిర్వహించడం అనేది వాస్తవమేనని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే ఎఫ్ఏఓ బాధ్యతల నుండి తప్పించి ఆమె అదనపు బాధ్యతలు తీసుకున్న నాటి నుండి అన్ని రకాల ఆర్థిక లావాదేవీలపై, చెల్లింపులపై సమగ్ర విచారణ చేయించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రాజన్న, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ సుదామ్ ఉన్నారు.

నవతెలంగాణ కథనంతో షోకాజ్ నోటీసు



అవినీతికి కేరాఫ్‌గా విద్యాశాఖ అంటూ నవతెలంగాణలో వచ్చిన కథనంపై డీఈఓ దుర్గాప్రసాద్ స్పందించారు. డిప్యూటేషన్ రద్దు కోసం డబ్బులు డిమాండ్ చేసిన ఉద్యోగికి షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఇక ఎస్‌-ఎస్ఏలో విధుల్లో ఉన్న అధికారిపై వచ్చిన ఆరోపణల విషయంపై సమగ్ర నివేదికను సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు సమర్పించామని తెలిపారు. ఇక కేజీబీవీ అకౌంటెంట్లతో అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామ్ విచారణ కోసం విద్యాశాఖాధికారి కార్యాలయానికి పిలిపించామని తెలిపారు.

బారికేడ్‌ను ఢీకొని యువకుడు మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని దగ్గి శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన గల బారికేడ్‌ను ఢీకొని యువకుడు మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇందల్‌వాయి మండలం వెంగల్‌పాడ్‌కు చెందిన మాలవత్‌రెడ్డి (34) సదాశివనగర్ మండలంలోని యాచారం గ్రామానికి చెందిన మేనమామ చంద్రును దింపి తిరుగు ప్రయాణంలో బారికేడ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మాలవత్‌రెడ్డి మృతి చెందాడు. కాగా అతి వేగమే ప్రమాదానికి దారితీసిందని పోలీసులు భావిస్తున్నారు. భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించి పోస్ట్‌మార్టం కోసం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన గిరిజనులు

- ఖాళీ బిందెలతో నిరసన
- అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో


రాస్తారోకో చేస్తున్న తండావాసులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మాలోతాండకు చెందిన గిరిజనులు గురువారం తాగునీటి కోసం లింగంపేట్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై ఖాళీ బిందెలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా ఇప్పటివరకు తాగునీటి సమస్యను పరిష్కరించిన దాఖలాల్లేవని గిరిజనులు మండిపడ్డారు. గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులకు పలుమార్లు తాగునీటి సమస్య పరిష్కరించాలని మొరపెట్టుకున్నా పరిష్కరించలేదన్నారు. ఎండలు తీవ్రం కావడంతో తాగునీటి కోసం బోరు బావుల వద్ద కిలోమీటర్ల దూరంలో వెళ్లి తాగునీటిని తీసుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఈ ధర్నాకు బీజేపీ నాయకుల మద్దతు తెలిపారు. రాస్తారోకోతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సమస్య పరిష్కరిస్తామన్న హామీతో నిరసన విరమించారు.

అమరవీరుల సాక్షిగా సేవలను గుర్తించాలి


నివాళులర్పిస్తున్న కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు

నవతెలంగాణ-భిక్కనూర్

అమరవీరుల సాక్షిగా కాంట్రాక్టు ప్రొఫెసర్ల సేవలను ప్రభుత్వం గుర్తించాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ గుప్తా తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించి, సౌత్ క్యాంపస్‌లో అమరవీరులకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను తక్షణమే క్రమబద్ధీకరించాలని, తమ సేవలను ప్రభుత్వం తక్షణమే గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, నరసయ్య, రమాదేవి, సునీత, వైశాలి, సరిత, శ్రీకాంత్, కనకయ్య, దిలీప్, శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలతోనే తెలంగాణ

- వారి త్యాగాలను స్మరించుకోవాలి
- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ఘనంగా అమరవీరుల దినోత్సవం
- శ్రద్ధాంజలి ఘటించిన పలువురు


నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయప్రతినిధి

తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానాలు చేసుకున్న అమరుల త్యాగాలు స్మరించుకోవడానికే తెలంగాణ సంస్మరణ దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త, నగర మేయర్ దండునీతూ కిరణ్, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, అధికారులు హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం త్యాగం చేసిన వారి కుటుంబాలను గౌరవించుకోవడం కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లాలోని అన్ని స్థానిక సంస్థలు అయిన గ్రామ, మండల, మున్సిపాలిటీ, కార్పొరేషన్ కార్యాలయాల్లో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అమరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారన్నారు. తెలంగాణ అమరవీరులను కచ్చితంగా స్మరించుకోవాలని వాళ్ల త్యాగాల ఫలితంగానే తెలంగాణ సిద్ధించిందని కలెక్టర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో జిల్లాలో 32 మంది ఆత్మబలిదానాలు చేసుకున్నారని వారి కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున నగదు అందించామని 30 మందికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించామన్నారు. మరో ఇద్దరి కుటుంబాలకు కూడా ఉద్యోగాలు ఇవ్వనున్నామన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 21 రోజుల పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజలకు వివరించామన్నారు. గ్రామ, మండల, జిల్లాస్థాయి అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అమరువీరుల కుటుంబాల త్యాగాలు మరువలేనివన్నారు.

అమరవీరుల కుటుంబాలను కేసీఆర్ ఆదుకుంటున్నారు..

తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారి కుటుంబాలను ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదుకుంటున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ విఠల్‌రావు అన్నారు. 2001 నుంచి కేసీఆర్‌తో అడుగులో అడుగు వేసి ఉద్యమంలో పాల్గొన్నామన్నారు. ఉద్యమంలో అనేక ప్రాంతాలు తిరిగి తెలంగాణ ఆవశ్యకత గురించి వివరించామన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యోగులు 42 రోజుల పాటు సకల జనుల సమ్మె 90 రోజుల పాటు సహాయ నిరాకరణ చేశారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల సహకారంతో తెలంగాణ సాధించి కేసీఆర్ 9 ఏళ్లలో ఎంతో అభివృద్ధి సాధించామన్నారు.


అమరవీరుల కుటుంబ సభ్యులకు సన్మానం


సభకు హాజరైన అధికారులు, నాయకులు

ప్రజా పోరాట యాత్రను విజయవంతం చేయండి

- సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్


మాట్లాడుతున్న చంద్రశేఖర్

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రజా పోరాట యాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని జంగంపల్లి గ్రామంలో గురువారం జరిగిన భూ సాధన సమితి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 20 సంవత్సరాల కింద కొనుగోలు చేసిన భూమిని 14 ఏళ్ల కింద పట్టాలు పొందినప్పటికీ ఈ ప్రభుత్వాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, పేద ప్రజలు పోరాటం చేస్తూ ఇక్కడనే నివాసం ఉంటున్నారని అన్నారు. ఈ పోరాట కేంద్రాన్ని సందర్శించడానికి ఈనెల 24న ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బస్సుయాత్ర వస్తుందని, యాత్ర జయప్రదానికి గ్రామంలోని నిరుపేదలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, నాయకుల అర్జున్, ప్రవీణ్, బాబ్జాన్, నరసయ్య, పేరం నర్సవ్వ, బాలమని తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు మైనర్లపై లైంగిక దాడి

- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ఓ ఘటనలో పదేండ్ల బాలికపై మైనర్ అబ్బాయి లైంగికదాడికి పాల్పడగా.. మరో ఘటనలో 16 యేండ్ల అమ్మాయిపై 21 యేండ్ల యువకుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలు నిజామాబాద్ రూరల్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూశాయి.

వివరాలు మెయిన్‌లో..

విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- జులై 2, 3 తేదీల్లో కామారెడ్డిలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాలు
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి అన్నారు. జులై 2,3 తేదీల్లో కామారెడ్డిలో రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాలకు రాష్ట్ర నలుమూలల నుంచి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని కావున విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను పూర్తిగా విస్మరిస్తుందని విద్యాసంస్థల ప్రారంభమైన తర్వాత విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయని అన్నారు. ప్రభుత్వ విద్య సంస్థలలో మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అదేవిధంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సుమారు 5వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలలో ఫీజుల దందాను ఆపాలని, లేకపోతే పాఠశాలలపై భౌతిక దాడులకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్, జిల్లా ఉపాధ్యక్షులు అల్తాఫ్, నాయకులు మణికంఠ, సాయి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవి

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని కురుదుల్ పేట్ గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయం దగ్గర, ఎంపీపీ నిధులు లక్షా అరవై వేలతో ఏర్పాటుచేసిన హైమాస్ట్‌లైట్లను జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసి బాజిరెడ్డి జగన్మోహన్, స్థానిక ఎంపీపీ సంగీత రాజేందర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తోట రాజన్న, సర్పంచ్ గంగాధర్, ఎంపీటీసీ గాండ్ల సతీష్ పటేల్, ఉప సర్పంచ్ అన్నారం భూమయ్య, చిన్నోళ్ల గంగాధర్, విడిసి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎక్సైజ్ కార్యాలయం గురువారం పేద విద్యార్థినీ విద్యార్థులకు 100 ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీ ప్రారంభించారు. 11 మంది పేద పిల్లలకి స్టేషన్లో అందజేసినట్టు సిఐ స్టీవెన్ సన్ తెలిపారు. ఎస్సైలు, సిబ్బంది సహకారంతో పంపిణీ చేయడం జరిగినది అని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చారు...

మౌలిక వసతులు మరిచారు..

బోర్గాం శివారు ప్రాంతంలో
పేదల అవస్థలు
తాగునీటికి కటకట
మురుగుకాలువల నిర్మాణం లేదు
2015లో సర్కారు పట్టాలు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బోర్గాం శివారు ప్రాంతంలో నివసిస్తున్న పేదలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. 2015 సంవత్సరంలో సర్కారు పట్టాలు ఇచ్చినప్పటికీ.. నేటికీ కనీస వసతులు కల్పించడం లేదు. తాగునీరు, మురుగుదొడ్లు లేకుండా పోయాయి. పైగా పట్టాలు ఇచ్చినప్పటికి లబ్ధిదారులకు నిర్దిష్టమైన స్థలం చూపలేదు. దీంతో 8 సంవత్సరాలుగా పేదలు టార్పాలిన్ కవర్లతో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం స్థలం చూపితే పక్కా ఇండ్లు నిర్మించుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మితో సాయం చేయాలని కోరుకుంటున్నారు.



టార్పాలిన్ కవర్లతో ఏర్పాటుచేసుకున్న వసతి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నగరంలోని బోర్గం శివారు ప్రాంతంలో 2015 సంవత్సరంలో తెలంగాణ ప్రభుత్వం సుమారు 150 కుటుంబాలకు 40 గజాల స్థలం చొప్పున పట్టాలు అందించింది. పట్టాలు ఇచ్చినప్పటికీ.. నిర్దిష్టమైన స్థలం చూపలేదు. దీంతో ఆ కుటుంబాలు ప్రస్తుతం టార్పాలిన్‌లతో గుడారాలు వేసుకుని జీవిస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మరుగుదొడ్లు లేవు. రోడ్లు, విద్యుత్తు దీపాలు కరువయ్యాయి. తాగునీటికి అవసరమైన నల్లాలు సైతం ఏర్పాటు చేయలేదు. ఈ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ రంగ కార్మికులు, పశువుల కాపర్లు ఉన్నారు. రోజువారిగా పని చేసుకుంటేనే కానీ బతకలేని నిరుపేదలున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు కొద్దిమేర వేసినప్పటికీ.. బయటి వ్యక్తులు అడ్డుకోవడంతో వైర్లు వేయలేదు. దీంతో కర్రల సాయంతో తాత్కాలికంగా విద్యుత్తును కొద్దిమంది ఏర్పాటు చేసుకున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే వణుకు...

ఈ ప్రాంతంలో సుమారు 40-50 సంవత్సరాలుగా జీవిస్తుండటంతో 2015లో పట్టాలు ఇచ్చారు. కానీ స్థలం చూపకపోవడంతో టార్పాలిన్లతో గుడారాలు వేసుకున్నారు. కానీ వర్షాకాలం వచ్చిందంటే ఈదురుగాలులతో టార్పాలిన్‌లు ఎగిరిపోతున్నాయని, చినిగిపోతున్నాయని బాధితులు వాపోతున్నారు. దీంతో వర్షంలోనే పిల్లలతో సహా జాగారం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి టార్పాలిన్ గుడారాలకు 10-15 వేలు ఖర్చు చేస్తున్నామని అంటున్నారు. కాబట్టి ప్రభుత్వం నిర్దిష్ట స్థలం చూపితే ఇండ్లు నిర్మించుకుంటామని చెబుతున్నారు. రూరల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మొదటిసారి ఎమ్మెల్యే అయిన తర్వాత ఈ పట్టాలను అందించారని, మళ్లీ ఆయన చొరవతో పక్కా ఇండ్లు నిర్మించుకునేలా స్థలాలు చూపాలని కోరుతున్నారు.

నీటి వసతిని అడ్డుకుంటున్నారు : బాలరాజు

ఈ స్థలాలపై కొంతమంది కన్ను వేశారు. నిరుపేదలను ఇక్కడి నుంచి పంపించేయాలని కుట్ర చేస్తున్నారు. గతంలో 40-50 కుటుంబాలు కలిసి బోర్ వేయించాలనుకున్నాం. సుమారు 100 ఫీట్ల వరకు డ్రిల్లింగ్ చేసిన బోర్‌ని ఆపివేశారు.

వర్షాకాలం, ఎండకాలం ఇబ్బందులు : శాంతవ్వ

పక్కా ఇండ్లు లేకపోవడంతో వర్షాకాలం, ఎండకాలం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా ఎండకాలం ఎండలు విపరీతంగా కొట్టడంతో ఉదయం వండిన అన్నం నీరు కారిపోతుంది. రోజూ అన్నం వృథా అవుతోంది. గుడారాలతో మధ్యాహ్నం సమయంలో కాలుపెట్టలేకపోతున్నాం.



నవోదయకు ఎంపికైన మిసిమి పాఠశాల విద్యార్థి



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాల విద్యార్థి కాండ్లి వైష్ణవ్ జవహర్ నవోదయకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలే రవీందర్ తెలిపారు. గురువారం విడుదలైన నవోదయా ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పాఠశాల విద్యార్థి కాండ్లి వైష్ణవ్ జవహర్ నవోదయకు ఎంపికవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. వారిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం సభ్యులు అభినందించారు.

రైతుబంధుకు అప్లై చేసుకోవాలి

నవతెలంగాణ-మోపాల్

నూతనంగా 16-6- 2023 వరకు ఎవరైతే వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు ఉంటారో వారు రైతుబంధు పథకానికి అప్లై చేసుకోవచ్చుని మండల వ్యవసాయ అధికారి రవీందర్ గురువారం తెలిపారు. వారి వెంట ఆధార్ కార్డు, ఖాతా బుక్కు, పట్టా పాస్ బుక్కు జిరాక్స్ దరఖాస్తు ఫారంతో కలిపి స్థానిక రైతు వేదికలో గల ఏఈఓ చక్రపాణికి ఇవ్వాలని పేర్కొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, వైద్యులు

నవతెలంగాణ-సిరికొండ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం నిమిత్తం వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ మాలావత్ సంగీత రాజేందర్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం లక్షలు వెచ్చించి పల్లె దవాఖానాలు ఏర్పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసిందని, వైద్యానికి వచ్చిన రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వం లక్షల రూపాయల నిధులు మంజూరు చేస్తుందని, వాటిని సక్రమంగా వినియోగించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం అండ్ హెచ్ ఓ తుకారాం రాథోడ్, వైస్ ఎంపీపీ తోట రాజన్న, డిప్యూటీ తాసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, మండల వైద్యాధికారి అరవింద్, సిబ్బంది అనంతరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యువతరం ఉద్యమిస్తే దోపిడీ వర్గాలకు నిద్ర పట్టదు



మాట్లాడుతున్న సూర్యశివాజీ

నవతెలంగాణ-ఆర్మూర్

యువతరం శివమెత్తితే దోపిడీ వర్గాలకు నిద్ర పట్టదని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ అన్నారు. పివైఎల్ ఏరియా 8వ మహాసభ గురువారం పట్టణంలోని రాజారామ్ నగరంలో ఎస్. వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని ఆయన అన్నారు. స్వదేశీ పేరుతో మోడీ, ఇంటికో ఉద్యోగం అంటూ కేసిఆర్ యువతను మోసం చేశారని ఆయన అన్నారు. మోడీ, కేసీఆర్ అప్పులు చేసి పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్నారని ఆయన అన్నారు. యువశక్తిని మద్యం మత్తులో, బూతు, అశ్లీల సాహిత్యంతో బంధిస్తున్నారని అన్నారు. ఉద్యమిస్తే నిర్బంధిస్తున్నారని, కెసిఆర్ తెలంగాణ ఉద్యమ సందర్భంగా ఇచ్చిన హామీలు నీళ్ల మూటలుగా మారాయని, వారు అన్నారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ఎస్ రవి, అరుణోదయ జిల్లా అధ్యక్షులు వి. సూరిబాబు మాట్లాడుతూ పాలకుల కుట్రల్ని పసిగట్టి ఉద్యమిస్తే భారతదేశంలో మౌలిక మార్పు సంభవిస్తుందని తెలిపారు. ఉపాధి కల్పించకుండా, ఉత్పత్తిలో యువతని భాగస్వామ్యం చేయకుండా నిరుద్యోగాన్ని, ఆకలి, అసమానతల్ని, పెంచుతున్నారని వారు అన్నారు. భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి, ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన అన్నారు. అమరవీరులకు జోహార్లను అర్పించారు. ఈనెల 25న నిజామాబాద్ నగరంలోని ఎన్ఆర్భవన్లో జరిగే జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు ఎస్ రవి యువతను కోరారు. కార్యక్రమంలో పిడిఎస్యు ఆర్మూర్ డివిజన్ అధ్యక్షులు బి. ప్రిన్స్, నాయకులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-వేల్పూర్

వేల్పూర్ గ్రామానికి చెందిన సేన గణేష్ మొబైల్ ఫోన్‌ని పోలీసులు గురువారం అందజేసినట్టు ఎస్ఐ వినయ్ తెలిపారు. గణేష్ 20 రోజుల క్రితం వెంకటాపూర్ గ్రామానికి వెళ్తుండగా పోగొట్టుకున్నాడు. ఆయన వెంటనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మొబైల్ ఫోన్ వివరాలు సిఈఐఆర్ పోర్టల్‌లో నమోదుచేసిన పట్టుకున్నారు. మొబైల్ ఫోన్‌ను బాధితునికి అందజేశారు.

పనులపై సమీక్ష

మండల సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-భీంగల్

పట్టణకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ ఆర్మూర్ మహేష్ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ ప్రారంబానికి ముందు తెలంగాణ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మూడు నెలల నుండి చేట్టిన పనుల వివరాలను ఆయాశాఖల అధికారులు చదివి వినిపించారు. రాబోవు మూడు నెలల్లో చేపట్టాల్సిన పనులపై సమీక్షించారు. సమావేశంలో జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిడిఓ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీధర్‌కుమార్, ఎంఈఓ స్వామి, ముచ్కూర్ సొసైటీ చైర్మన్ మాలవత్ వెంకటేష్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని గాంధీనగర్‌కు చెందిన సంపంగి లక్ష్మణ్ కుటుంబానికి ఆరేంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడిన లక్ష్మణ్ ఇటీవల చనిపోయారు. విషయం తెలుసుకున్న ముత్యాల సునీల్ కుమార్ గురువారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు నల్ల గణేష్ గుప్తా, సింగిరెడ్డి శేఖర్, పార్శపు రాకేష్, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో అందించి ప్రభుత్వ పాఠశాల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి కళ్యాణ్ జిల్లా నగర అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకాలంలో పాఠ్యపుస్తకాలు యూనిఫాంలో అందించి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలు (రేకులు ఊడిపోవడం కిటికీలు విరిగిపోవడం బెంచీలు సరిగ్గా లేకపోవడం ఫ్యాన్లు, బ్లాక్ బోర్డు లేకపోవడం)వంటి సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరినారు. దీనికి కలెక్టర్ సానికూలంగా స్పందించి ఈ నెల 28నుండి ప్రభుత్వ ఆదేశాల మేరకు అందిస్తామని తెలిపారు ,అదేవిధంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు యూనిఫాంలో అమ్మడాన్ని కలెక్టర్ తెలియజేయడం జరిగింది కలెక్టర్ సానుకూలంగా స్పందించి డి ఈ ఓ ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు ప్రశాంత్, దేవేందర్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరులకు ఘన నివాళ్లు

నవతెలంగాణ-విలేకరులు

అవతరణ దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామగ్రామాన తెలంగాణ అమరులకు ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో తెలంగాణ కోసం అమరులైన వారికోసం మౌనం పాటించారు.



వేల్పూర్: నివాళ్లు అర్పిస్తున్న నాయకులు, తదితరులు

కమ్మర్‌పల్లి: గ్రామాల్లో సర్పంచుల అధ్యక్షతన గ్రామస్తులందరూ రెండు నిమిషాలు మౌనం పాటించి తెలంగాణ అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లి మండలంలో..

భీంగల్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చివరి రోజు గురువారం పట్టణకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర సాధనకు అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడా భీంగల్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు అమరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జెడ్పీటీసి చౌట్‌పల్లి రవి, యంపిపి ఆర్మూర్ మహేష్ , మన్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత సురేంద్, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, నాయకులు శర్మనాయక్,రాగుల మోహన్, మాంద్ర సుమన్, కిషన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూరలో బీఆర్ఎస్ నాయకులు, అమరుల స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు. పచ్చల నడుకూడ ఉన్నత పాఠశాలలో ప్రార్థన సమయంలో ప్రధానోపాధ్యాయులు సురేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అనంతరం అమరవీరుల త్యాగాలను స్మరించు కున్నారు. పాఠశాల ఆవరణలో మార్చ్ నిర్వహిం చారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి గ్రామ సచివాలయం వద్ద అమరవీరులకు నివాళుల ర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్వేత గంగారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ లింబ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..

జక్రాన్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఎంపిపి కుంచాల విమల రాజు అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రెండు నిమిషాలు మౌనం పాటించారు .

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాల యందు ఉత్సవాలలో భాగంగా బడిబాట నిర్వహించారు. ఇంటింటికి ఉపాధ్యాయులు తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నేటి వరకు 20 మంది పాఠశాలలో చేర్పినట్లు ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్ తెలిపారు. గురువారం అమరులకు ప్రార్థన సమయంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సర్పంచులు రాలే

మండల సమావేశంలో
సగానికిపైగా గైర్హాజరు
ప్రజల ఆగ్రహం




మాట్లాడుతున్న ఎంపీపీ

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో గల రైతు వేదికలో గురువారం ఎంపీపీ లతా కన్నీరం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది, ముందుగా అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మండలంలో 21 గ్రామపంచాయతీలు ఉండగా సగానికి పైబడి సర్పంచులు హాజరు కాలేదు. గ్రామాల పరిస్థితి అంతంతమాత్రాన ఉంటే కనీసం సర్వసభ్య సమావేశాలు కూడా హాజరు కాకపోవడం శోచనీయం. ఇద్దరు ముగ్గురు సర్పంచులకు పలు సమస్యల వల్ల రాలేకపోయారు కానీ మిగతా సర్పంచులకు ఏమైందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తహసీల్దార్ శ్రీలత మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల గురించి గవర్నమెంట్ నుంచి ఎటువంటి ఆర్డర్స్ రాలేవని వచ్చిన వెంటనే తెలియజేస్తానని అన్నారు. మండల ఏఈ బాబా శ్రీనివాస్ పోల్స్‌కి సంబంధించిన సమస్య తన దృష్టికి వచ్చిందని త్వరలో పోల్స్ వేస్తామని తెలిపారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లకు కెపాసిటర్లు, పెట్టాలని దానివల్ల చాలా వరకు బిల్లు తగ్గుతుందని తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి ఇప్పటికి నూతన పంచాయతీల ప్రతిపాదనలు వచ్చాయని, ఎమ్మెల్యేతో శంకుస్థాపన కూడా చేయించామని తెలిపారు. కార్యక్ర మంలో ఎంపీడీవో లింగం నాయక్, ఎంపిఓ ఇక్బాల్, మిషన్ భగీరథ ఏ ఈ వినయ్, పంచాయతీరాజ్ ఏఈ స్రవంతి, ఏపిఎం మోహన్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గృహలక్ష్మీ పథకం ద్వారా 10 లక్షల రుణాన్ని ఇవ్వాలి

సీపీఐ జిల్లా కార్యదరిశ సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గృహలక్ష్మీ పథకం ద్వారా 10 లక్షల రుణాన్ని ఇంటి నిర్మాణం కోసం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఇంటి నిర్మాణానికి అవసరం అయ్యే వస్తువులను ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. నగరంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు. గృహలక్ష్మి పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3వేల ఇండ్లు, మూడు లక్షలు మాత్రమే ఇస్తామనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కమ్యూనిస్టు పార్టీగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరితే, ఇళ్ల స్థలాలు కాదు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ముఖ్యమంత్రి, గతంలో డబుల్ బెడ్ రూంకు 5 లక్షల కల్పించి, ప్రస్తుతం 3 లక్షలతో సరిపెడతాననడం తెల్ల రేషన్ కార్డు ఉన్నవారు మాత్రమే అర్హులని తెలపడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వమే సిమెంటు, స్టీలు, ఇటుక, ఇతర సామాగ్రి అందించాలని లేదా పెరిగిన ఇంటి నిర్మాణ వస్తువుల ధరలను దృష్టిలో పెట్టుకొని గృహ లక్ష్మి పథకానికి 10 లక్షలు ఇస్తూ నాణ్యమైన పనులు చేపట్టే విధంగా కలెక్టర్ నేతృత్వంలో ప్రభుత్వ అధికారిని నియమించి గృహ నిర్మాణాలు చేపట్టాలని కోరారు. ఈ ప్రెస్ మీట్లో సిపిఐ దక్షిణ మండల కార్యదర్శి పి.రంజిత్ కుమార్, నాయకులు పి.హనుమాన్లు, రాధకుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

నవతెలంగాణ-రెంజల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవంలో భాగంగా ఎంపీడీవో శంకర్‌కు ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు రావడంతో ఎంపీపీ రజని కిషోర్, మండల పరిషత్ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. జిల్లాలో ఉత్తమ ఎంపీడీవోగా రెంజల్ మండలానికి రావడం సంతోషకరంగా ఉందని ఆమె పేర్కొన్నారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచందర్, సర్పంచ్ ఎమ్మెస్ రమేష్‌కుమార్, వీరన్నగుట్ట తాండ సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్, డాక్టర్ వినయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాసరావు, ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి, రంజాన్ సింగిల్ విండో చైర్మన్ మొయినుద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, హెచ్‌ఈఓ శ్రావణ్ కుమార్, పీఆర్ ఏఈ, మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంపిటేషన్ కోఆర్డినేటర్‌గా రాజారెడ్డి



నవతెలంగాణ-వర్ని

మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ డెలిగేట్ కూనిపూర్ రాజారెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టానం జుక్కల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ కోఆర్డినేటర్‌గా డాక్టర్ కూనీపూర్ రాజారెడ్డి నియామకం చేసింది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జుక్కల్ అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించిన పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ 16 నుంచి 35 సంవత్సరాల వారు యువతీ యువకులు రాజీవ్‌గాంధీ క్విజ్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

కానిస్టేబుల్ మృతి

- అంత్యక్రియల కోసం రూ.20 వేలు అందించిన డీఎస్‌పీ, సీఐ, ఎస్‌ఐ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ బీర్కూరులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్య కారణాలతో బుధవారం మరణించగా ఆయన స్వగ్రామమైన మద్నూర్‌లో నిర్వహించిన అంత్యక్రియలకు బాన్సువాడ డీఎస్పీ జగన్నాథరెడ్డి, బిచ్కుంద సీఐ కృష్ణ, మద్నూర్ ఎస్‌ఐ కృష్ణారెడ్డి, బీర్కూర్ హెడ్ క్వార్టర్ ఎస్‌ఐ హాజరయ్యారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.20వేలు మృతుని భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా బాన్సువాడ డి.ఎస్.పి జగన్నాథ్ రెడ్డి మాట్లాడుతూ కానిస్టేబుల్ రాజ్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వపరంగా అందవలసిన బెనిఫిట్స్ మొత్తం అతి త్వరలో అందిస్తామని తెలిపారు.

ఎలుగుబంటి తిరిగే చోటుకు వెళ్ళవద్దు

- ఫారెస్ట్ అధికారుల సూచనలు

నవతెలంగాణ-వర్ని

చందూర్ మండలం లక్ష్మపూర్ గ్రామ శివారులో గత కొన్ని రోజుల నుంచి ఎలుగుబంటి సంచరిస్తుందని గ్రామస్తులు సర్పంచ్ బొద్దోళ్ల సత్యనారాయణకు గ్రామస్తులు తెలపడంతో ఈ విషయాన్ని సర్పంచ్ ఫారెస్ట్ అధికారులకు సమాచారాన్ని అందించగా ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్‌లు గ్రామ ప్రజలకు ఎలుగుబంటి నుంచి ఎలా రక్షణ పొందాలో అవగహన కల్పించారు. పంటచేలకు, అటవీ ప్రాంతాలకు వెళ్లవలసి వస్తే ఇద్దరు వ్యక్తులు కలిసి పోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాలక వర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పైసలిస్తేనే అనుమతి

నవతెలంగాణ-ఎడపల్లి

ఉండటానికి నిలువ నీడ లేక అప్పో సొప్పో చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని పర్మిషన్ కొరకు పంచాయతీ అధికారులను కలిస్తే పైసలు ఇస్తేనే పర్మిషన్ ఇస్తాం. లేదంటే ఇవ్వమని పంచాయతీ కార్యదర్శి ముప్పుతిప్పలు పెడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని అంబం (వై)గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఆగడాలు రోజు రోజుకు ఎక్కువవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. గ్రామంలో ఎవరైనా ఇల్లు కట్టలన్నా, కరెంట్ మీటర్ పెట్టాలన్న, జన్మదినం, మరణ ధ్రువీకరణ పత్రం, వివాహ ధ్రువీకరణ పత్రం, ఓనర్ షిప్ వంటి ధృవీకరణ పత్రాలు కావాలన్న, పర్మిషన్‌లు కావాలన్న ఎటువంటి పనులు కావాలన్న పంచాయతీ కార్యదర్శికి ముడుపులు చెల్లిస్తేనే పనులు చేస్తున్నారని లేదంటే పనులు చేయడం లేదని బాధితులు తెలిపారు. రోజుల తరబడి తిప్పుతూ కాలయాపన చేస్తూ బాధితులు విసిగిపోయి డబ్బులు సమర్పించే వరకు చూస్తున్నారని అన్నారు. గతంలో స్థానిక సర్పంచ్ పిస్కా గంగప్రసాద్, ఎంపీపీ శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శిని పలుమార్లు హెచ్చరించినప్పటికీ అతని ప్రవర్తనలో ఏ విధమైన మార్పు రాలేదు. దీంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ మీటర్ పర్మిషన్ విషయంలో ఎంపీపీ శ్రీనివాస్ జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయడానికి పంచాయతీ కార్యదర్శిపై ఎంపీఓకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అతని ప్రవర్తనలో మార్పు రాకపోతే పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ తెలిపారు.

ప్రైవేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలి

నవతెలంగాణ-బోధన్

ప్రైవేటు విద్యాసంస్థలలో అధిక ఫీజులు వసూలను అరికట్టాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలే నాగేష్ డిమాండ్ చేశారు. గురువారం బోధన్ పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేటర్ పాఠశాలల యజమాన్యాలు విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను దోపిడీకి గురిచేస్తున్నారని అన్నారు. ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా అధిక ఫీజులు వసూలు చేయడం, అంతేకాకుండా కమిషన్లకు కక్కుర్తి పడి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు సైతం విక్రయిస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నరసింహ, అశోక్, పిరాజి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి

- ఐకేపీ జిల్లా అధికారి సుధాకర్



నవతెలంగాణ-రామారెడ్డి

మహిళా సంఘాలు, సంఘం ఆదాయం పెంచుకోవడానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా ఐకేపీ అధికారి సుధాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శ్రీ కాలభైరవ మండల సమైక్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. తీసుకున్న అప్పులను సక్రమంగా చెల్లించాలని, ఆరు నెలలకు ఒక్కసారి ఆడిటింగ్ చేయించాలని, ఖాతాల్లో పారదర్శకత ఉండాలని, లావాదేవీలు జరిగినప్పుడు, ప్రతి సభ్యురాలుకు రసీదు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్నకుమార్, సీసీలు భూమాగౌడ్, దుర్గ దాసు, శ్రీనివాస్, ప్రతాప్, సిబ్బంది అనిల్, అధ్యక్షురాలు గాయత్రి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, వివిధ గ్రామాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ : కేంద్రంలోని బీజేపీ మోడీ సర్కార్ చేపట్టిన అభివృద్ధి పనులను పలు మండలాల్లో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు బి.హనుమాన్లు, జనరల్ సెక్రటరీ, చాట్ల హన్మాండ్లు, కృష్ణపటేల్, సంతోష్ తులావార్, కంచిన్వార్ యాదవరావ్, అశోక్, చెక్రపాణి, తుకరం తెప్పవార్, లక్ష్మణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మన్‌రావు పటేల్, మండల ఉపాధ్యక్షులు శివకుమార్ మహారాజ్, అశోక్, సాయి, శివ తదితరులు ఉన్నారు.

రెంజల్ : కేంద్రంలో గత తొమ్మిది సంవత్సరాల బీజేపీ పాలనలో చేసిన అభివృద్ధి పనుల గురించి గడపగడపకు తెలియపరచాలన్న తలంపుతో నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీ కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, జడ్పీటీసీ మేక విజయ సంతోష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత తొమ్మిది సంవత్సరాల కాలంలో మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం
అన్ని రంగాల్లో విఫలం

- దశాబ్ది కాదు.. దగా ఉత్సవాలు
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలు దహనం



ఎల్లారెడ్డి : సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



భిక్కనూర్‌లో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నీ రంగాల్లో విఫలమైందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నవి దశాబ్ది ఉత్సవాలు కాదని.. అవి దగా ఉత్సవాలు అని తెలిపారు. టీపీసీసీ ఆదేశాల మేరకు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నందుకు నిరసనగా.. సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను పలు మండలాల్లో గురువారం దహనం చేశారు.

ఎల్లారెడ్డి : తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ ఉపాధ్యక్షులు మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కేంద్రంలో దశాబ్ది దగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎల్లారెడ్డిలో అంబేద్కర్ చౌరస్తా వద్ద కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మదన్ మోహన్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని వృథా చేస్తూ, రాష్ట్ర ప్రజలను మోసానికి గురిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా మాటలతో పబ్బం గడుపుతూ మళ్ళీ ఎన్నికలు వస్తున్నాయని కళ్లి బొల్లి మాటలు చెప్తున్నారని తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్ పార్టీ మారి ఎల్లారెడ్డి ప్రజలకు ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా పంపిణీ చేయలేదన్నారు. రాబోయే ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

టీపీసీసీ ఆదేశాల పిలుపు మేరకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం నిరసనగా ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి ఎమ్మార్వోకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం దశాబ్ది ఉత్సవాలతో ప్రజలను దగా చేస్తున్న కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగాపడ్డ తెలంగాణలో మీరు ఏం అభివృద్ధి చేశారని ఈ దశాబ్ది ఉత్సవాలు చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బోధన్ : పట్టణంలోని ఆచన్‌పల్లి వద్ద గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాల పేరుతో తెలంగాణ అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న ప్రభుత్వం పది సంవత్సరాల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం పది తలల, కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాషా మొహిన్ ఉద్దీన్, పట్టణ కార్యానిర్వాక అధ్యక్షుడు అబ్బగొని గంగాధర్‌గౌడ్, నవీన్, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భిక్కనూర్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. దశాబ్ది ఉత్సవాలు కావు దగా ఉత్సవాలు అంటూ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్థానిక చౌరస్తా వద్దకు చేరుకుని అక్కడ కొద్దిసేపు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిరంతర పోరాటం చేస్తుందని, హామీలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింబాద్రి, జిల్లా కార్యదర్శి సురేష్, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, నాయకులు సురేష్, సాజీద్, భూమయ్య, నర్సింలు, భీమయ్య, సాయిలు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలో రెండు రోజుల క్రితం 13 సంవత్సరాల మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితుడు కొత్తపల్లి రవీందర్ ను కఠినంగా శిక్షించాలని ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ అన్నారు. గురువారం బోధన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నిరుపేద మైనర్ బాలికను అత్యంత ఘోరంగా అత్యాచారం చేసిన నిందితుడిని ప్రభుత్వం చట్టంలోని అన్ని సెక్షన్లను ఉపయోగించి కఠినంగా శిక్షించాలని కోరారు. నిందితుడి సోదరుడు మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అయిన రాధాకృష్ణ బాధిత కుటుంబాన్ని బెదిరించడం సహించరానిదని, అతనిని కూడా చట్టరీత్య శిక్షపడేలా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మధు, వినోద్ నాయక్, స్వామి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ ఫ్లోర్‌లీడర్‌గా గంగారం..

మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ పార్టీ 18వ వార్డు కౌన్సిలర్ గంగారంను ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ నియమించినట్టు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ తెలిపారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని అధికారులు ప్రజాసమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.. వర్షాకాలం ప్రారంభమైనందున అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఇక విద్యుత్ శాఖ అధికారుల తీరు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని పంచాయతీ కార్యదర్శులతో పాటు సభ్యులు సభాదృష్టికి తీసుకురాగా.. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీపీ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో పంచాయతీల వద్ద అమరవీరుల నివాళులు అర్పించే కార్యక్రమం ఉన్నందున సర్పంచుల్లో మెజారిటీ శాతం హాజరుకాలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో రాణి, ఎంపీఓ సురేకాంత్, వైస్ ఎంపీపీ లక్ష్మి, మిషన్ భగీరథ డీఈ కౌశిక్, ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలో అమరుల పాత్ర గొప్పది

- ఘనంగా అమరవీరుల దినోత్సవం
- అమరుల కుటుంబాలకు సన్మానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

తెలంగాణ ఉద్యమంలో అమరవీరుల పాత్ర ఎంతో గొప్పదని ప్రజాప్రతినిధులు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం అమరవీరుల దినోత్సవాన్ని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

భిక్కనూర్ : మండల కేంద్రంతో పాటు కాచాపూర్, పెద్ద మల్లారెడ్డి, ఇస్సన్నపల్లి, రామేశ్వరపల్లి, బస్వాపూర్, తిప్పాపూర్ గ్రామాలలో అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు ప్రజాప్రతినిధులు నాయకులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, జెడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, వైస్ ఎంపీపీ యాదగిరి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు హనుమంత రెడ్డి, మండల రైతు సమన్వయ కమిటీ కన్వీనర్ రామచంద్రం, సర్పంచులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీలో పాలకవర్గం ఆధ్వర్యంలో అమరు వీరుల దినోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. అమరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అమరవీరులకు జోహార్లు అంటూ పాలకవర్గం పంచాయతీ కార్యదర్శి సిబ్బంది కలిసి అమరులకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన అమరవీరులతోనే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సందీప్, పంచాయతీ అధికారులు, పాలకవర్గం సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బస్సీపటేల్, గ్రామ రైతు సమన్వయ సమితి సభ్యులు కంచిన్ హనుమాన్లు కర్రీవార్ రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ కే శ్రీనివాస్ అధ్యక్షతన అమరుల దినోత్సవాన్ని నిర్వహించారు. అంతకుముందుగా తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలు చేసి అమరులైన వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామారావు, పీహెచ్సీ వైద్య అధికారులు రాజ్‌కుమార్, నిఖిల్, ఐకేపీ ఏపీఎం సాయిలు, ఏపీవో గంగారాం, ఐసీడీఎస్ ఎడపల్లి మండల సూపర్‌వైజర్ వినోద, సర్పంచులు, ఎంపీటీసీలు విద్యావంతులు అధికారులు పాల్గొన్నారు.

వర్ని : ఉమ్మడి మండలాల్లో ప్రతి గ్రామంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కానిస్టేబుల్ కిష్టయ్య విగ్రహానికి మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి గోపాల్ పూలమాలవేసి నివాళులర్పించారు. చందూర్‌లో సర్పంచ్ సాయరెడ్డి, లక్ష్మపూర్‌లో సత్యనారాయణ, ఎస్ఎన్‌పురంలో సర్పంచ్ నాగమణి, వీర్రాజ్, ఎంపీపీ మేక శ్రీలక్ష్మి విరాజ్‌లు అమరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులు అర్పించారు. సర్పంచులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాటం చేసి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా అమరులైన విద్యార్థులకు, పోలీసులకు జోహార్లు తెలిపారు.

దోమకొండ : మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణాలను అర్పించిన అమర వీరులకు ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కానుగంటి శారద ఎంపీడీఓ చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో అన్ని రంగాలలో ఉజ్వల ప్రగతి సాధిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి బాపురెడ్డి, ఎంపిటిసిలు ఫిరంగి రాజేశ్వర్, కడారి రమేష్, నిమ్మశంకర్, కోట సదానంద, దోర్నాల లక్ష్మీ, కో ఆప్షన్ శమ్మి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏఈలు సురేందర్‌రెడ్డి, మీనా, ఏపీవో రజనీ, ఏపీఎం రాజు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అమరవీరులకు ఎంపీపీ గైని అనుసూయ నివాలర్పించారు. ఈసందర్భంగా ఎం.పి.డి.ఓ లక్ష్మీ తెలంగాణ ఉద్యమాల గురించి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దన్వల్, ఎం.పి.టి.సిలు బీరయ్య, భైరవరెడ్డి, చందర్ రావు, నాయకులు, లింగం, రమేష్, రమేష్‌రావు, ఎ.పి.యం రాజిరెడ్డి, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎంపీపీ మాధవి బలరాజ్‌గౌడ్ తెలంగాణ ఉద్యమంలో అమరులైన వారికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాధవి బలరాజ్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మ గౌరవం , స్వయం పాలన కోసం ఆరు దశాబ్దాల పాటు తొలి మలి దశ ఉద్యమలు త్యాగపూరితమైనవి అని చరిత్రాత్మకమైనవని తెలిపారు. అణిచివేత, హింసను లెక్క చేయకుండా 1969 తొలి దశ పోరాటంలో వందలాదిమంది ఉద్యమ కారులు పోలీసులు కాల్పుల్లో నెలకొరిగారని, మలి దశ పోరాటంలో ఎంతో మంది విద్యార్థులు బలిదానాలతో ప్రణాలు త్యాగ ఫలమే నేటి తెలంగాణ రాష్ట్రం అని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉష గౌడ్, ఎంపిడిఓ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.



జుక్కల్ : జీపీ సెక్రెటరీలకు సన్మానం

జుక్కల్ : మండలంలోని 30 గ్రామ పంచాయతీలలో, మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలలో అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. జయశంకర్‌సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ల అర్పించారు. సఫాయి కార్మికులకు దుస్తులు పంపిణీ చేసి సన్మానించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని జీపీల జూనియర్ పంచాయతి సెక్రెటరీలకు, సిబ్బందికి కార్యాలయ అధికారులు సన్మానించారు.

అమరుల త్యాగాలు వెలకట్టలేనివి..

రామారెడ్డి : ఉమ్మడి రాష్ట్రంలో, ఆంధ్ర పాలకుల పరిపాలనలో తెలంగాణ అభివృద్ధి వెనుకకు నెట్టేయబడిందని, స్వరాష్ట్ర సాధన కోసం, వెలకట్టలేని జీవితాలను, స్వరాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలు చేసిన అమరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, చివరి రోజు మండలంలోని ఆయా గ్రామాలతో పాటు, మండల కేంద్రంలోని రైతు వేదికలో అమరులకు నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరులను స్మరిస్తూ మౌనం పాటించారు. ఈ సందర్భంగా దశరథ్ రెడ్డి మాట్లాడుతూ... తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకుని, అభివృద్ధిలో దూసుకుపోతున్న రాష్ట్రాన్ని, ప్రపంచ దేశాలు తెలంగాణ వైపు చూస్తున్నాయని, చిన్న చిన్న సమస్యలను, ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. అమరుల త్యాగఫలం, కెసిఆర్ సచ్చుడో, తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో, ముఖ్యమంత్రి కేసీఆర్, ఢిల్లీ మెడలు వంచి తెలంగాణను సాధించారని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీంద్రరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : తెలంగాణ రాష్ట్ర సాధనకై ఉద్యమించి అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను మరువలేనివని బోధన్ ఎంపిపి బుద్దె సావిత్రి అన్నారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పర్భన్న, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మెన్ షకీల్, బీఆర్ఎస్ ముఖ్య నేత బుద్దె రాజేశ్వర్, పార్టీ మండల కార్యదర్శి సుదర్శన్, ఎంపీఓ మధుకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లోలపు రజిని కిషోర్ అధ్యక్షతన అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక తెలంగాణ కోసం అసువులు బాసిన అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామచందర్, ఎంపీడీవో శంకర్, ఎంపిఓ గౌస్ ఉద్దీన్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, వీరన్నగుట్ట తండా సర్పంచ్ జాదవ్ గణేష్ నాయక్, ఎంపీటీసీ చింతకుంట లక్ష్మి, ప్రధానోపాధ్యాయులు కట్ట శ్రీనివాసరావు, విజయలక్ష్మి, ఏపీఎం చిన్నయ్య, హాస్టల్ వార్డెన్ శ్రీకాంత్, గ్రామ కార్యదర్శులు అంగన్వాడీ కార్యకర్తలు, ఆశలు, వీవోఏలు పాల్గొన్నారు.

మన ఊరు మనబడి పనులు పరిశీలన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మన ఊరు మన బడిలో చేపట్టిన పనులను పంచాయతీరాజ్ డిఈ రాజేశ్వర్ గురువారం పరిశీలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న అదనపు తరగతి గదులకు సంబంధించిన మెటీరియల్ వర్క్, పెయింటింగ్ వర్క్‌లపై కాంట్రాక్టర్‌కు సూచనలు ఇచ్చారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు కొనసాగించాలన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న అదనపు గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ రాజ్ ఏఈ రాగసుధ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి, శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మల్లం చెరువు మరమ్మత్తులు ప్రారంభం

నవతెలంగాణ-సిరికొండ



మండలంలోని తాటిపల్లి గ్రామంలో గల మల్లం చెరువు కట్ట మరమ్మత్తులు గురువారం ధర్పల్లి జడ్పిటిసి, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్మోహన్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... చెరువుల కట్టలు మరమ్మత్తులు చేయడం వల్ల ఆయకట్టుదారులకు లబ్ధి జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలవత్ సంగీత రాజేందర్, సర్పంచ్ తిరుపతి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఆకుల తిరుమల్, ఉప సర్పంచ్ సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కేసీఆర్ హామీలు అమలుకాలే

- కాంగ్రెస్ పార్టీ నాయకులు
- కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హమ్దాన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ దశాబ్ది దగా నిరసనలో భాగంగా పది తలల రావణాసురుని రూపంలో కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పిసిసి ప్రధాన కార్యదర్శి ఫక్రుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ప్రజల జీవితాలు ,నిరుద్యోగ యువత జీవితాలు బాగుపడతాయని సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రం ఇస్తే తెలంగాణ వచ్చి పది సంవత్సరాలు గడుస్తున్నా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతుందని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల డబ్బుతో బీఆర్ఎస్ పార్టీ ప్రచారం చేసుకుంటుందని ఆయన అన్నారు. దళితులకు మూడు ఎకరాల భూమి, దళిత సీఎం, ఫీజు రియంబర్స్మెంట్, బీసీ బంధు, నిరుద్యోగ భృతి, ఇంటికొక ఉద్యోగం ఊసు అసలుకే లేదని, బోధన్ షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తెరిపిస్తామని లేకుంటే తలనరకుంటామని చెప్పిన సీఎం కేసీఆర్, ఆయన కూతురు 10 సంవత్సరాలు గడుస్తున్న ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోతుంటే పరిహారం అందించడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమైందని ప్రశ్నించారు. ఇకనైనా సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. పిసిసి ప్రధాన కార్యదర్శి ఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడ ఎన్నికలు వస్తే అక్కడ నిధుల వర్షం కురిపిస్తూ ఎన్నికలు మూగియ గానే అభివృద్ధి మాటే మాట్లాడడం లేదని అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఇల్లు లేని పేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయలు ,వంటగ్యాస్ 500 రూపాయలకు, వైద్యం కొరకు 5 లక్షల రూపాయలు, మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి ,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతీరెడ్డి రాజారెడ్డి ,జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్ ,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు తంబాకు చంద్రకళ,పోల ఉష, సేవాదళ్ సంతోష్, రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి ఉబెద్ బిన్ హందన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేష్, అబుద్బిన్ హందాన్, నగర మైనారిటీ అధ్యక్షులు ఏజాజ, నగర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రీతం తదితరులు పాల్గొన్నారు.



కంఠేశ్వర్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆర్మూర్ :కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో నల్ల బ్యాడ్జిలు ధరించి దశబ్దపు దగా నిర్వహించి కేసీఆర్ పది తలల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మార చంద్రమోహన్ మాట్లాడుతూ ఎన్నికల్లో కేసీఆర్ ఇచ్చిన హామీలను తొమ్మిదిన్నర పాలనలో అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏ ఆశయాల కోసం ఏర్పడిందో అమరులు తమ ప్రాణ త్యాగలు ఏ ఆశయాల కోసం చేశారో అవి నేర వేరలేదని అన్నారు. ఉద్యమ నినాదం అయిన నీళ్ల నిధులు నియమాకాలు మరిచి పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబ గౌడ్, మీర్ మాజీద్, విట్టం జీవన్, పురుషోత్తం, మందుల పోశెట్టి, జిమ్మి రవి, ఫాయిమ్, మెహబూబ్, బట్టు శంకర్, హబీబ్, మీసాల రవి, చిన్నా రెడ్డి, ఉస్మాన్, బాలకిషన్,చేపూర్ శ్రీనివాస్, నవీద్, మల్కన్న, పెద్ద పోశెట్టి, శ్రీకాంత్, దినేష్, ప్రవీణ్, కిషోర్, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో..

750 గ్రాముల గంజాయి పట్టివేత

- ఇద్దరు అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంనుండి మునిపల్లి వెళ్లే మార్గంలో గంజాయిని తరలిస్తుండగా పట్టుకుని, గంజాయి తరలిస్తున్న వ్యక్తులను అరెస్టుచేసినట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. ఎన్‌ఫోర్స్ మెంట్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ నిజామాబాద్ డివిజన్ కిషన్ ఆదేశాల మేరకు పట్టణ ఎక్సైజ్ సిబ్బంది గురువారం రూట్ వాచ్‌లో గంజాయి సరఫరా చేస్తున్నారనే సమాచారంతో పట్టణం నుండిముని పెల్లి మార్గంలో గస్తీ నిర్వహించారు. రంజాన్ కుమార్ అనే వ్యక్తి దొండ శివకుమార్ అనే వ్యక్తి సహకారంతో టూవీలర్ పై 750 గ్రాముల గంజాయి తరలిస్తూ పట్టుకున్నట్టు తెలిపారు. ఈ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి ఎక్సైజ్ స్టేషన్కు తరలించినట్టు చెప్పారు. గస్తీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ స్వప్న, ఎస్సైలు ప్రమోద్ చైతన్య, చంద్రమౌళి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-సిరికొండ

గోసంగి కులస్తులు అంటే అంత చులకన, వారి ప్రాణాలకు విలువ లేదా అని గోసంగి కుల సంఘం జిల్లా అధ్యక్షులు మల్లెలసాయి చరణ్ ప్రశ్నించారు. నిజామాబాద్ గోసంగి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిరికొండ గ్రామానికి చెందిన గోసంగి కులస్తుడు శ్రీమంతుల బాలకృష్ణ గ్రామ పంచాయతీలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడని, సిరికొండ విద్యుత్‌శాఖ లైన్‌మెన్ మోహన్ నాయక్ తను చేయవల్సిన పనిని బాలకృష్ణకి చేయమని ఎల్సీ తీసుకున్నానని బలవంతంగా కరెంట్ స్తంభంపైకి ఎక్కించాడని తెలిపారు.

ఎల్సీ లేకపోవడంతో గతనెల 16న కరెంట్ షాక్ తగిలి బాలకృష్ణ చేయి కాలిపోయిందని అన్నారు. బాధితుడిని ఆదుకొని, లైన్‌మెన్‌ను సస్పెండ్ చేయాలని, లేకుంటే డీఈ కార్యాలయాన్ని ముట్టడి స్తామని హెచ్చరించారు. వెంటనే ఏడీఈ డిచ్‌పల్లి వచ్చి లైన్ మెన్‌పై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. బాలకృష్ణకు న్యాయం జరగకపోతే పెద్దఎత్తున రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లెల సాయి చరణ్, ప్రధాన కార్యదర్శి భాస్కర్, గౌరవ అధ్యక్షుడు గంగా నర్సయ్య, కోశాధికారి ధర్మపురి, వర్కింగ్ ప్రెసిడెంట్ గంగన్న, సాయన్న,సలహాదారులు, కార్యదర్శులు,రాగవులు,రామస్వామి, నడిపి నర్సయ్య, సత్యనారాయణ, రమేష్, నడిపి సాయిలు, దేవరాజ్,నర్సయ్య, సిరికొండ మండల అన్ని గ్రామాల గోసంగి సభ్యులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున పోలీసు అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూటుమెంటు బోర్డు నిర్వహిస్తున్న సర్టిఫికేషన్ వెరిఫికేషన్ అదనపు డి.సి.పి (ఎ.ఆర్) గిరిరాజు ఆధ్వర్యంలో గురువారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వమించారు. ఎనిమిదవ రోజుకు 616 మంది అభ్యర్థులను పిలవగా 562 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి (ఎ.ఓ) బి. శ్రీనివాస్, ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్ మక్సూద్ హైమద్ గోవింద్ సిపిఓ కార్యాలయం సిబ్బంది, రిజర్వు విభాగం సిబ్బంది ఐటి కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయకు ప్రతిభ స్కూల్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-సిరికొండ



2023-24 విద్యా సంవత్సరానికి గాను ప్రతిభ హై స్కూల్ విద్యార్థిని నర్మల శ్రీహితరెడ్డి జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ సుంకం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరీష్, కరస్పాండెంట్ గణేష్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవోదయకు ముగ్గురు విద్యార్థులు ఎంపిక







నవతెలంగాణ-నవీపేట్

జవహర్ నవోదయ 6 వ తరగతిలో నవీపేట్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు మండల కేంద్రంలోని స్కాలర్స్ పాఠశాలకు చెందిన రెమ్మ తేజస్విని, లిటిల్ ఫ్లవర్ పాఠశాల కు చెందిన ధీరజ్, యజ్ఞకృత్ లు ఎంపికైనట్లు పాఠశాలల కరస్పాండెంట్లు గురువారం తెలిపారు. విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పాఠశాల యాజమాన్యంతో పాటు పలువురు అభినందించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోపాల్

మండలకేంద్రంలో సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్లు, లాయర్లపై రాజ ద్రోహం కేసు పెట్టడం అనేది సిగ్గుచేటని, వారేమైనా దేశద్రోహం చేశార అని ప్రశ్నించారు. ములుగు జిల్లా తాడువాయి పోలీస్ స్టేషన్లో ప్రొఫెసర్ హరగోపాల్, నిజామాబాద్ జిల్లా నుండి వాల్గొగో రవీందర్‌తో పాటు సుమారు 152మంది మేధావులపై, ప్రొఫెసర్లపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఉప చట్టం రద్దు చేయాలని అన్నారు. సిపీఎం ప్రజాపంథ మోపాల్ మండల కార్యదర్శి దండు గంగమలు, చంద్రపు సాయ గౌడ్, మంగల్ పాడ్ నారాయణ, చిన్న గంగ మల్లు, దండు మహేష్, అగ్గి రాములు, సాయిలు, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు, సర్పంచులు గైర్హాజరు

- నామమాత్రంగా సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం నామమాత్రంగా జరిగింది. అధికారులు, సర్పంచులు గైర్హాజరుతో సభ వెలవెల బోయింది. ఈ సమావేశానికి ట్రాన్స్ కో, అటవీ, నీటిపారుదల, ఆర్.అండ్.బి, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, ఆర్టీసి, ఉద్యానవన అధికారులు గైర్హాజరు అయ్యారు. 8 మంది సర్పంచ్ లకు గాను కేవలం ఇద్దరే హాజరయ్యారు. హాజరైన అధికారులు కేవలం కాగితాల మీద రాసుకొచ్చిన వాటిని చదివి తూతుమంత్రంగా సమావేశం కానిచ్చారు. ఇందులో మొదటగా వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ... ఈ నెల 26 నుండి రైతులకు, రైతుబంధు ఖాతాల్లో జమ అవుతాయని, మొదట ఎకరం నుండి 2 ఎకరాలు ఉన్న వారికి తర్వాత అంతకు మించి ఉన్నవారికి పడతాయని తెలిపారు. ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ఎంఈఓ ఆంధ్రయ్య మాట్లాడుతూ... విద్యార్థులకు సరిపడా నోట్ బుక్‌లు వచ్చాయని, అందరికి అందజేస్తామని తెలిపారు. ఈ సంవత్సరం ప్రైమరీ పాఠశాలలో తరగతి గదికి ఒక ట్యాబ్‌ను అందజేస్తామని తెలిపారు.ఏర్గట్ల మండలానికి ఎంఆర్‌సి భవనం మంజూరు అయ్యిందన్నారు. గుమ్మిర్యాల్ సర్పంచ్ సోమా రాజారెడ్డి మాట్లాడుతూ... మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా మా గుమ్మిర్యాల్ ప్రాథమిక పాఠశాలలో గదులు నిర్మాణంతో పాటు వివిధ పనులు చేయించానని, 6 నుండి 7 లక్షల రూపాయలు ఖర్చు చేశానని, కానీ పైసలు రావడం లేదని వాపోయారు. ఎంపీఓ శివ చరణ్ కల్పించుకొని అడిషనల్ కలెక్టర్ తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఎంపీటీసీ జక్కని మధుసూదన్ మాట్లాడుతూ.. ప్రాథమిక వైద్యశాలలో పాముకాటుకు విరుగుడు మందును ఎందుకు ఉంచడం లేదని, రైతులు పంటలు వేసే సమయంలో పాముకాటు గురైతే ఎలా అని ప్రశ్నించారు. మందును ఉంచే ఫ్రిజర్ లేకపోవడంతో విరుగుడు మందును అందుబాటులో ఉంచడం లేదని వైద్యులు బదులిచ్చారు. ఎంపీఓ శివ చరణ్ మాట్లాడుతూ... బీసీ కులవృత్తుల వారినుంచి మండలంలో 380 అప్లికేషన్లు అందాయని, అర్హులైన వారికి సమయానికి ప్రభుత్వం తరపున చెక్కులు అందిస్తామని, ఈ పథకానికి కుటుంబంలో ఒక్కరు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. తహసీల్దార్ జనార్ధన్ మాట్లాడుతూ... వివిధ దేశాలకు వెళ్లిన వ్యక్తులు రేషన్ కార్డులో పేరు లేకపోతే నమోదు చేసుకునే అవకాశం ఉందని, అలాగే కుటుంబంలో నాలుగు సంవత్సరాలు దాటిన పిల్లలకు కార్డులో యాడ్ చేసుకునే వీలు ఉందని, రేషన్ కార్డులో పేర్లు నమోదు చేసుకున్న వారికి ఇప్పటికీ ఎలాంటి మంజూరు రాలేదని అన్నారు. అనంతరం తెలంగాణ అమర వీరుల స్థూపం ఆవిష్కరణ సందర్భంగా అమరుల కుటుంబాలకు సభలో రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేంథర్ రెడ్డి,వైస్ ఎంపీపీ నల్ల లావణ్య,ఎంపీటీసీ జక్కని మధుసూదన్, సర్పంచ్లు సోమరాజారెడ్డి,భానుప్రసాద్ ,ఎమ్మార్వో జనార్ధన్,ఎంపీఓ శివ చరణ్,ఏపీఎం శ్యామ్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ఏకకాలంలో రుణమాఫీ చేసి రుణాలు ఇవ్వాలి

- ఏఐపికెఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేసి ఖరీఫ్ సీజన్ కు నూతనంగా బ్యాంకు రుణాలు ఇప్పించి, విత్తనాలన్నీ ఉచితంగా సప్లై చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో (ఏఐపికెఎస్) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం, జిల్లా అధ్యక్షులు ఎస్.సురేశ్, మాట్లాడుతూ 9 సంవత్సరాల కాలంలో సీఎం కేసీఆర్ ఏకకాలంలో రైతు రుణాలు రద్దు చేసిన పాపను పోలేదని అన్నారు. కేవలం వడ్డీలకు వడ్డీలు పెరగడంతో వడ్డీలు కూడా పూర్తిగా మాఫీ చేయలేని స్థితిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని తెలిపారు. రైతుల బాకీలన్ని రద్దుచేసి ఈ సీజన్ పెట్టుబడి కింద నూతన అప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని రకాల విత్తనాలను సహకార సంఘం ద్వారా ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోడు సాగుదారు లందరికీ పట్టాలిస్తానని చెప్పాన కేసీఆర్ ఈనెల 24న కేవలం గిరిజనులకు కొద్దిమందికి మాత్రమే ఇచ్చి ఎన్నికల ప్రచారానికి ఉపయోగించు కుంటున్నారని గుర్తుచేశారు. రెవెన్యూ అటవీ వివాదాలను పరిష్కరించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రీసైక్లింగ్ చేసి మార్కెట్లో అమ్ముతున్న విత్తనాలను గుర్తించి కఠినమైన చర్యలు చేపట్టాలని, వ్యాపారుల లైసెన్స్ రద్దు చేయాలని అన్నారు. రబీ సీజన్లో నష్టపోయిన ప్రతి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టి రైతుల్ని కాపాడాలని, 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్, బి.బాబన్న, పుట్టి నాగన్న, జిలకర.నడిపెన్న, మల్లన్న, యు.రాజన్న, శంకరన్న, వి.బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

డివి కృష్ణ వర్ధంతి సభ

పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు, సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సభ పోస్టర్లను పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న మాట్లాడుతూ డివి కృష్ణ ప్రథమ వర్ధంతి సభ ఈనెల 26న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందన్నారు. డివి కృష్ణ తన జీవితాంతం విప్లవోద్యమం కోసం అవిశ్రాంతంగా కృషి చేసినారని తెలిపారు. వర్ధంతిసభలో విప్లవోద్యమ అభిమానులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్, పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. సంధ్యారాణి, పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేశ్, ఐఎఫ్టియు, పివైఎల్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నివాళ్లు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల వేడుకలలో భాగంగా గురువారం "అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని" నగరంలోని వినాయక్ నగర్లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద జెడ్పి చైర్మన్ దాదన్నగారి విట్టల్ రావు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జెడ్పి కార్యాలయంలో జిల్లా పరిషత్ ప్రత్యేక సర్వ సభ్య సమావేశంలో పాల్గొని అమరులని స్మరించుకొని శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ లు, కో -ఆప్షన్ సభ్యులు, జెడ్పి సీఈఓ గోవింద్, డిప్యూటీ సీఈఓ సుందర వరదరాజన్, పంచాయతీ రాజ్ గ్రామీణ నీటి సరఫరా ఇంజనీరింగు శాఖ అధికారులు ప్రభాకర్, రాజేంద్రకుమార్, నరేష్, సిబ్బంది, జెడ్పి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఓఏలకు లోకోస్ యాప్‌పై ప్రత్యేక శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని మహిళ సమాఖ్య భవనంలో వీఓఏలకు లోకోస్ యాప్ గురించి, స్వయం సహాయక సంఘ సభ్యుల అకౌంట్ పై అధికారులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... ఈ యాప్ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యుల సంక్షిప్త సమాచారం ఆన్లైన్ లో అప్డేట్ చేయడం జరుగుతుందని, దీని వల్ల ప్రభుత్వం నుండి వచ్చే రుణాలు, వడ్డీ రాయితీ స్వయం సహాయక సభ్యుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం నూకల శ్రీనివాస్, ఏపీఎం శ్యామ్, సీబీఓ ఆడిటర్ బోజన్న, సీసీలు నవీన్, సంతోష్, అకౌంటెంట్ సుప్రియ, వీఓఏలు పాల్గొన్నారు.